క్లుప్తంగా

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభించిన కమిషనర్ రామారావు

సామర్లకోట: స్థానిక రైల్వే స్టేషన్ సెంటర్‌లో శనివారం మున్సిపల్ కమిషనర్ జె.రామారావు చలివేంద్రాన్ని ప్రారంభించారు. రైల్వే స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్ అనుమతితో స్టేషన్ ఆవరణలో ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు నిత్యం రద్దీగా ఉండే బస్సు కాంప్లెక్స్, రైల్వే స్టేషన్ కూడలిలో ఈ చలివేంద్రాలు ఏర్పాటు చేసినట్టు కమిషనర్ తెలిపారు. మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టరు పి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

12వ వార్డులో సోషల్ మీడియా కన్వీనర్ ప్రచారం



సామర్లకోట 12వ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న సుధాకర్

సామర్లకోట: స్థానిక 12వ వార్డులలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ వారా సుధాకర్ శనివారం ఇంటింట ఎన్నికల ప్రచారం చేశారు. కాకినాడ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు చలమలశెట్టి సునీల్, దవులూరి దొరబాబులను ఫ్యాను గుర్తులపై ఓట్లు వేయాలని ఆయన ఓటర్లను అభ్యర్థించారు. 12 వార్డులో కౌన్సిలర్ వారా పాప, వారా నాగేశ్వరరావులు ప్రత్యేకంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. 13వ వార్డులో ఆ వార్డు కౌన్సిలర్ నేతల హరిబాబు, 31వ వార్డులో ఆ వార్డు కౌన్సిలర్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పాగా సురేష్‌కుమార్, వీకే రాయపురంలో పార్టీ జిల్లా కార్యదర్శి తలారి దొరబాబు వైఎస్సార్ సీపీ అభ్యర్థులకు మద్దతుగా ఇంటింట ఎన్నికల ప్రచారం చేస్తున్నారు.

చంద్రబాబుకు మానవత్వం లేదు



కొత్తపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

కొత్తపల్లి: టీడీపీ అధినేత చంద్రబాబుకు మానవత్వం లేదని, పింఛనుదారులను ముప్పుతిప్పలు పెడుతున్న ఆయన పాపం ఊరికే పోదని వైస్ ఎంపీపీ మదిరెడ్డి దొరబాబు అన్నారు. స్థానిక రవీంద్రపురంలో శనివారం ఆయన ఇంటింటా ప్రచారం నిర్వహించారు. పిఠాపురం ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత, ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్‌లకు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో కాపుల నాగేశ్వరరావు, యర్ర శ్రీనివాస్, మందుల వీర్రాస్వామి తదితరులు పాల్గొన్నారు.

కరగపాడులో న్యాయ విజ్ఞాన సదస్సు

గోపాలపురం: మండలంలోని కరగపాడు సచివాలయం వద్ద శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. కొవ్వూరు సెకండ్ అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ జి.సాయి కృష్ణ తన ప్రసంగంలో కరగపాడు నుంచి ఎలాంటి కోర్టు కేసులు లేకపోవడం అభినందనీయమన్నారు. ఉన్నత న్యాయస్థానం ఆదేశాల ప్రకారం చట్టంపై అవగాహన కలిగించేందుకు గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో న్యాయ వాదులు పి తారాకుమారి, జె చంద్రశేఖర్, ఎస్సై కర్రి సతీష్‌కుమార్, సర్పంచ్ బొమ్మన నాగలక్ష్మి,నాగరాజు, జె రత్నకిషోర్ పాల్గొన్నారు.

ఉపాధి హామీ పని ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం

కోటనందూరు: ప్రస్తుతం అందుతున్న సంక్షేమ పథకాలు యథావిధిగా కొనసాగాలంటే సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రి చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని తుని ఏఎంసీ వైస్ చైర్మన్ వెలగా వెంకటకృష్ణాజీ అన్నారు. స్థానిక ఉపాధిహామీ పని ప్రాంతాల్లో శనివారం వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి ఓట్లు అభ్యర్థించారు. ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటేసి తుని ఎమ్మెల్యే అభ్యర్థి దాడిశెట్టి రాజా, కాకినాడ ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో గర్సింగ్ దొరబాబు, కొరుప్రోలు కృష్ణ, మల్లంపల్లి ప్రకాష్, దార్ల సూర్యచంద్ర పాల్గొన్నారు.

మూకుమ్మడిగా వలంటీర్ల రాజీనామా

ప్రత్తిపాడు రూరల్: మండలంలో గ్రామ వలంటీర్ల రాజీనామాలు కొనసాగుతున్నాయి. పెద్దిపాలెంలో 21 మంది గ్రామ వలంటీర్లు శనివారం మూకుమ్మడిగా రాజీనామా చేశారు. తమ రాజీనామా పత్రాలను ఎంపీడీఓ డేవిడ్ రాజ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లోనూ ప్రాణాలకు తెగించి సేవలందించిన తమను ప్రస్తుతం ఎన్నికల నేపథ్యంలో విధులకు దూరం చేయడానికి నిరసనగా రాజీనామా చేస్తున్నట్టు తెలిపారు.

ప్రశాంతంగా పోస్టల్, హోం ఓటింగ్

ఎన్నికల ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్ నివాస్



పెద్దాపురంలో ఇంట్లో ఓటు వేస్తున్న వృద్ధురాలు. హోం ఓటింగ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ నివాస్

పెద్దాపురం: జిల్లా వ్యాప్తంగా ప్రారంభమైన పోస్టల్ బ్యాలెట్, హోం ఓటింగ్ ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో నిర్వహించినట్టు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జె.నివాస్ అన్నారు. నియోజకవర్గ పరిధిలో ఆర్‌ఓ జేఎస్ రామారావు ఆధ్వర్యంలో స్థానిక లూథరన్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ, పట్టణంలో నిర్వహించిన హోం ఓటింగ్‌ను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నివాస్ మాట్లాడుతూ 4, 5 తేదీల్లో నిర్వహించే పీఓ, ఏపీఓల ఓటింగ్ ప్రక్రియకు ఎటువంటి ఇబ్బందుల జరుగకుండా అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. ఓపీఓ, ఇతర శాఖలకు సంబంధించి సిబ్బంది ఆరో తేదీలోగా ఓటు హక్కు వినియోగించుకునే విధంగా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. జిల్లాలో ప్రథమంగా పెద్దాపురం సెగ్మెంట్‌లో ఓటింగ్ ప్రక్రియను ప్రారంభించి పకడ్బందీగా ఎన్నికల ప్రక్రియను ప్రారంభించామన్నారు. తొలుత స్థానిక గోలి వారి వీధిలోని హోం ఓటింగ్ ప్రక్రియను కలెక్టర్ నివాస్ పరిశీలించారు. పట్టణానికి చెందిన 103 సంవత్సరాల గోలి మంగాయ్యమ్మ ఓటు హక్కు వినియోగించడంపై ఆయన ప్రత్యేకంగా అభినందించారు. హోం ఓటింగ్‌లో సైతం పారదర్శకతను పాటించిన ఆర్‌ఓ జేఎస్ రామారావు, ఎన్నికల సిబ్బందిని కలెక్టర్ నివాస్ అభినందించారు. అనంతరం స్థానిక మహారాణి కళాశాలలో ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్‌లను ఆర్‌ఓ జేఎస్ రామారావుతో కలిసి పరిశీలించారు.

క్యూ కట్టిన ఉపాధ్యాయులు, ఉద్యోగులు

నియోజకవర్గంలో నిర్వహించిన పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్, హోం ఓటింగ్ ప్రక్రియ తొలిరోజు ప్రశాంతంగా ముగిసింది. ఈఆర్వో జె.సీతారామారావు ఆధ్వర్యంలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు స్థానిక లూథరన్ హైస్కూల్‌లో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియను నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటు హక్కును వినియోగించేందుకు నియోజకవర్గానికి చెందిన ఉపాధ్యాయులు, ఉద్యోగులు క్యూ కట్టారు, వారికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆర్‌ఓ అన్ని చర్యలు చేపట్టారు. దీనిలో భాగంగా నియోజకవర్గ పరిధిలో 1835 మంది పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌కుగాను తొలిరోజు 442 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు ఆర్వో తెలిపారు, అలాగే 153 మంది హోం ఓటింగ్‌ను వినియోగించుకోవాల్సి ఉండగా తొలిరోజు 124 మంది ఓటు వేసినట్టు తెలిపారు. నిష్పక్షపాతంగా పోస్టల్ బ్యాలెట్, హోం ఓటింగ్ చేపట్టినట్టు ఆర్డీఓ సీతారామారావు తెలిపారు.

పకడ్బందీగా హోం, బ్యాలెట్ ఓటింగ్

భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు హోం ఓటింగ్, పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌ను పకడ్బందీగా నిర్వహించామని పెద్దాపురం ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్‌ఓ జె.సీతారామారావు అన్నారు. స్థానిక లూథరన్ పాఠశాలలో నియోజకవర్గానికి చెందిన పీఓ, ఏపీఓలకు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌ను శనివారం సమర్థవంతగా నిర్వహించారు. అదే విధంగా నియోజకవర్గ పరిధిలోని సుమారు 155 మంది హోం ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకునేలా మూడు మొబైల్ టీంల ద్వారా ఆయా ఓటర్లు ఓటు వేసుకునేలా చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా మండలంలో జి.రాగంపేటలో నిర్వహించిన హోం ఓటింగ్‌ను ఆయన పరిశీలించారు. అనంతరం ఆర్‌ఓ స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఈ నెల 5న పెద్దాపురం అర్బన్. మండల ఓపీఓలకు ఓటు హక్కు వేసే అవకాశం ఉందన్నారు. ప్రస్తుత పోలింగ్ కేంద్రం వద్ద రద్దీ దృష్ట్యా 5వ తేదీన పెద్దాపురం అర్బన్, మండల ఓపీఓలు, 6వ తేదీన సామర్లకోట అర్బన్, రూరల్ ప్రాంతాల ఓపీఓలు తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని ఆర్‌ఓ సూచించారు. రాష్ట్రంలో తొలిసారి కేంద్ర ఎన్నికల సంఘం హోం ఓటింగ్ ప్రారంభించిందని, ఆ ప్రక్రియను సైతం ప్రశాంత వాతావరణంలో పకడ్బందీగా ఎన్నికల ప్రక్రియ నిర్వహించడం జరిగిందన్నారు.



పిఠాపురంలో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ నిర్వహిస్తున్న పోలింగ్ సిబ్బంది



జి.రాగంపేటలో హోం ఓటింగ్ ప్రక్రియను పరిశీలిస్తున్న ఆర్‌ఓ సీతారామారావు



పెద్దాపురంలో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియను పరిశీలిస్తున్న ఆర్‌ఓ సీతారామారావు

పిఠాపురంలో..

పిఠాపురం: స్థానిక బాదం మాధవరావు ప్రభుత్వ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రారంభమైంది. నియోజకవర్గంలో మొత్తం 2,057 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు ఉండగా వాటిలో పోలింగ్ సిబ్బంది 1,726 మంది, పోలీసులు 222 మంది, అత్యవసర సేవల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు 109 మంది, హోమ్ ఓటింగ్ 47 మంది, 85 ఏళ్ల పైబడి వయసు ఉన్న వృద్ధులు 26 మంది, దివ్యాంగులు 21 మంది ఉన్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ సోమవారం వరకూ కొనసాగనుంది. తొలిరోజు 45 శాతం మంది అధికారులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని అధికారులు తెలిపారు. ఓటింగ్ ప్రక్రియను జేసీ, పిఠాపురం నియోజకవర్గ ఎన్నికల అధికారి రాంసుందర్ రెడ్డి పర్యవేక్షించారు.

మంచి చేసిన నాయకుడికి అండగా నిలుద్దాం



యండపల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత



ఎన్నికల ప్రచారంలో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత

- పిఠాపురం ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత
- యండపల్లిలో ఎన్నికల ప్రచారం

కొత్తపల్లి: ఐదేళ్ల అధికారంలో సంక్షేమ పథకాల ద్వారా ఇంటింటికీ మంచి చేసిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి అందరూ అండగా నిలవాలని నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత అన్నారు. మండలంలోని యండపల్లిలో శనివారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలతో పేదల ఆర్థిక స్థితిగతులు మార్చారన్నారు. రాష్ట్రం మరింతగా అభివృద్ధి చెందాలన్నా, ప్రజలకు సంక్షేమం కొనసాగాలన్నా మళ్లీ సీఎంగా జగన్ రావాలన్నారు. అన్ని వర్గాల ప్రజల అభివృద్ధే ధ్యేయంగా జగన్ పరిపాలన కొనసాగుతుందన్నారు. అందుకే ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్ సీపీని అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. 2019–2024 మధ్య కాలంలో లక్షల కోట్ల రూపాయలు సంక్షేమ పథకాల రూపంలో నేరుగా లబ్ధిదారులకు అందించారన్నారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా సునీల్‌ను గెలిపిచాలని కోరారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ గుండ్ర శ్రీధర్, జ్యోతుల చక్రబ్బాయి, గుండ్రరాజుబాబు, ఎంపీటీసీ మచ్చ విజయతాత, పార్టీ మండల అధ్యక్షుడు ఆనాల సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులంతా వైఎస్సార్ సీపీ వైపే

రైస్‌మిల్లు కార్మికులతో సునీల్, దొరబాబుల భేటీ



లలితా రైస్‌మిల్లులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి దొరబాబు

పెద్దాపురం: కాకినాడ జిల్లా పెద్దాపురం ఏడీబీ వాలుతిమ్మాపురం రోడ్డులోని శ్రీలలితా ఎంటర్ ప్రైజెస్, పట్టాభి ఆగ్రో ఫుడ్స్ రైస్ మిల్లులోని కార్మికులంతా వైఎస్సార్ సీపీ మద్దతుగా నిలుస్తామని చెప్పారు. ఆయా రైస్‌మిల్లుల ఆవరణలో శనివారం సాయంత్రం కాకినాడ ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్, పెద్దాపురం ఎమ్మెల్యే అభ్యర్థి దవులూరి దొరబాబులు కార్మికులతో భేటీ అయ్యారు. లలితా రైస్‌మిల్లు అధినేతలు మట్టే శ్రీనివాస్, సత్యప్రసాద్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటైన సమావేశంలో సునీల్, దొరబాబు మాట్లాడుతూ ఈ దఫా ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి ఓటు వేసి గెలిపించాలి కోరారు. కార్మికులందరూ వైఎస్సార్ సీపీకి అండగా ఉంటామని సంఘీభావం తెలిపారు. మట్టే ఆదీష్‌బాబు, పట్టాభి ఆగ్రో ఫుడ్స్ యాజమాన్యం, సిబ్బంది పాల్గొన్నారు.

బాబు పంతం.. పింఛనర్లకు కష్టం

బ్యాంకుల వద్ద పింఛనుదారుల ఇక్కట్లు



కొత్తపల్లి యూనియన్ బ్యాంకులో పింఛనుదారుల కష్టాలు

కొత్తపల్లి: వైఎస్సార్ సామాజిక పింఛన్ల పంపిణీ బ్యాంకుల ద్వారా జరుగుతుండటంతో అవ్వా, తాతలకు మూడో రోజైన శనివారం కూడా ఇబ్బందులు తప్పలేదు. వలంటీర్ల ద్వారా పింఛన్ల పంపిణీకి చంద్రబాబు అండ్ కో అడ్డు చెప్పడంతో ఈ నెల పింఛన్లు కూడా ఎన్నికల కమిషన్ ఆదేశాలతో ప్రభుత్వం బ్యాంకుల ద్వారా పంపిణీ చేయాలని సూచించింది. దీంతో లబ్ధిదారుల పింఛను సొమ్మును వారి ఖాతాల్లో జమ చేశారు. పింఛనుదారులు గ్రామాల్లో వారి నివాసాలకు రెండు, మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న బ్యాంకులకు వెళుతున్నా ఖాతాలు వాడుకలో లేవంటూ బ్యాంకర్లు పదే పదే తిప్పుతున్నారు. మండలంలో 12,876 మంది పింఛనుదారులకు బ్యాంకు ఖాతాల్లో నగదును జమ చేశారు. చంద్రబాబు అండ్ కో పుణ్యమా అని ప్రస్తుతం తాము మండుటెండలో రోడ్డెక్కాల్సి వచ్చిందని వృద్ధులు వాపోతున్నారు.

స్థానికుడిని.. మీలో ఒక్కడిని.. గెలిపించండి



కొండపల్లిలో ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న దొరబాబు



సామర్లకోట మండలం ఉండూరు గ్రామంలో దవులూరి చంద్రకళ ఎన్నికల ప్రచారం

- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దవులూరి
- కొండపల్లి, ఆనూరులలో ఎన్నికల ప్రచారం
- దొరబాబుకు మద్దతుగా చంద్రకళ ఓట్ల అభ్యర్థన

పెద్దాపురం: మీలో ఒక్కడిని.. స్థానికుడినైన తనకు ఓటేసి నన్ను ఆశీర్వదించరూ అంటూ వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి దవులూరి దొరబాబు కోరారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా శనివారం రాత్రి మండలంలోని కొండపల్లి, ఆనూరు గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ఓట్లను అభ్యర్థిచారు. ఈ సందర్భంగా కొత్త చక్రరావు, స్వామి, ఎంపీపీ పెంకే సత్యవతి, గోపు నారాయణమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారాన్ని ఉద్దేశించి దొరబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను గుర్తెరిగి వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి ఓటు వేయాలని ఇంటింటికీ వెళ్ళి ఓటర్లను కలుసుకున్నారు. స్థానికుడినైన తనతో పాటు, ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని దొరబాబు కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మిరియాల రాజా, పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ, కంటే వీర్రాఘవరావు, జేసీఎస్ నియోజకవర్గ కన్వీనర్ గోపు మురళి, కనపర్తి బాబి, పెంటా విజయ్‌కుమార్, సుందరెడ్డి రాజు, తుమ్మల సురేష్, వెన్నా చిట్టిబాబు, నాగబోయిన రాజుబాబు, వారా సుధాకర్ అధిక సంఖ్యలో పార్టీ కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

స్థానిక అభ్యర్థికి అవకాశం ఇవ్వాలి

సామర్లకోట: నియోజకవర్గంలో స్థానిక అభ్యర్థికి ఒక అవకాశం ఇవ్వాలని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దవులూరి దొరబాబు సతీమణి చంద్రకళ అన్నారు. శనివారం మండల పరిధిలో ఉండూరులో సర్పంచ్ సత్యాడి ధనలక్ష్మి, సత్యనారాయణ ఉపసర్పంచ్ కొప్పిరెడ్డి రాధాకృష్ణ, సొసైటీ అధ్యక్షుడు ఎస్.కొండలరావు తదితరుల ఆధ్వర్యంలో ఆమె ఎన్నికల ప్రచారం చేశారు. సంక్షేమ పథకాల సారథి జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించడానికి ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. తన భర్త దవులూరి దొరబాబు స్థానిక అభ్యర్థిగా పోటీ చేస్తున్నారని, ఫ్యాను గుర్తుపై ఓట్లు వేసి ఆశీర్వదించాలన్నారు. ఆమె వెంట అయ్యారక కార్పొరేషన్ రాష్ట్ర చైర్‌పర్సన్ ఆవాల రాజేశ్వరీ, ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, దవులూరి చారిటబుల్ ట్రస్టు అధినేత దవులూరి సుబ్బారావు, గ్రామ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం



కోటనందూరులో ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న ఎస్సై శంకర్

కోటనందూరు: స్థానిక బస్టాండ్ సెంటర్‌లో శ్రీకరణసాయి ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శనివారం ఎస్సై బి.శంకర్ ప్రారంభించారు. ఎస్సై మజ్జిగను స్వయంగా ప్రయాణికులకు పంపిణీ చేశారు. రోజురోజుకూ ఉష్ణతాపం పెరిగిపోతున్న నేపథ్యంలో ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ఆటో యూనియన్ ప్రతినిధులు తెలిపారు. ఎండల తీవ్రత తగ్గేవరకూ చలివేంద్రాన్ని కొనసాగిస్తామని చెప్పారు.

టీ గ్లాసుల పట్టివేత



కారులో పట్టుబడిన టీ గ్లాసుల అట్టపెట్టెలు

పిఠాపురం: కాకినాడ జిల్లా పిఠాపురం జగ్గయ్య చెరువు బీఎంఆర్ స్కూల్ వద్ద ఎటువంటి అనుమతులూ లేకుండా 17 అట్టపెట్టెలతో తరలిస్తున్న టీ గ్లాసులను ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వీటిని తరలిస్తున్న కారును సీజ్ చేసి, మొత్తం సొత్తును తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్ అధికారి జి.దామోదర్ ఆ కారును క్షుణ్ణంగా తనిఖీ చేసి జనసేన గుర్తుగా ఉన్న టీ గ్లాసులు ఉన్నట్టు గుర్తించారు. విషయం తెలుసుకున్న జనసేన నాయకులు సంఘటన స్థలానికి చేరుకుని బేరసారాలు మొదలెట్టారు. భారీ మొత్తంలో ఉన్న ఈ గ్లాసులను ఎవరు ఆర్డర్ చేశారు, ఎక్కడికి తరలిస్తున్నారనే విషయాన్ని పోలీసులు విచారిస్తున్నారు. ఇదిలా ఉండగా, పిఠాపురం పట్టణ శివార్లలో జనసేన తాత్కాలిక కార్యకలాపాలు నిర్వహిస్తున్న గోకులం గ్రాండ్ హోటల్‌లో కూడా ఎన్నికల స్పెషల్ స్క్వాడ్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ప్రతి రూములోనూ ఈ తనిఖీలు చేశారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

హైకోర్టు బార్ ఎన్నికల్లో శేషుకుమారి ఎన్నిక

కాకినాడ లీగల్: హైకోర్టు బార్ అసోసియేషన్‌కు ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఎగ్జిక్యూటివ్ సీనియర్ లేడీ మెంబర్‌గా వరుపుల శేషుకుమారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శేషుకుమారి కాకినాడ బార్ అసోసియేషన్‌లో న్యాయవాది చేస్తూ ఏపీ హైకోర్టులో 15 ఏళ్లుగా న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్నారు. ఏలేశ్వరం మండలం లింగంపర్తికి చెందిన శేషుకుమారి న్యాయవాదిగా కాకినాడ బార్ అసోసియేషన్‌లో చేరారు. కాకినాడ బార్ న్యాయవాదులు ఆమె ఎన్నికపై హర్షం వ్యక్తం చేశారు.